నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చెన్నూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) :మండలంలోని కిష్టంపేట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

కోటపల్లి: కిష్టంపేట నుంచి కోటపల్లికి వెళ్లే 33కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. కోటపల్లి, ఆల్గామ, దేవులవాడ సబ్‌స్టేషన్‌ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ ఉండదని వినియోగదారులు సహకరించాలన్నారు.

లక్షెట్టిపేట: వేసవికాలం ముందస్తు చర్యల్లో భాగంగా జన్నారం, లక్షెట్టిపేట, దండేపల్లి మండలాల్లోని 33 కేవి సబ్ స్టేషన్‌లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 9 నుంచి 11గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈ ప్రభాకర్ రావు శనివారం ప్రకటనలో తెలిపారు.

108లో ప్రసవించిన మహిళ

లక్షెట్టిపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తలమల గ్రామానికి చెందిన కొడుప గంగుబాయి అనే మహిళ శనివారం 108వాహనంలోనే పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. సదరు మహిళ నిండు గర్భిణి. శనివారం నాడు పురుటి నొప్పులు రావడంతో స్థానికులు అంబులెన్సుకు సమాచారం అందించారు. గ్రామానికి చేరుకున్న 108 సిబ్బంది గర్భిణిని వాహనంలో ఎక్కించి ఆసుపత్రికి తరలిస్తుండగా నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్సు సిబ్బంది అనీల్, సత్యం చాకచక్యంగా వ్యవహరించి డెలివరీ చేసి లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి బిడ్డ ఇద్దరు క్షేమంగా ఉండటంతో అంబులెన్స్ సిబ్బందిని పలువురు అభినందించారు.

ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం



- మూడు లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా
- 321 సెంటర్ల ప్రారంభానికి సన్నాహాలు
- కేంద్రాల వద్ద రైతులకు మౌలిక సదుపాయాలు
- యాసంగిలోనూ సన్నాలకు రూ. 500 బోనస్
- మద్దతు ధరలపైనే రైతుల పెదవి విరుపు

మంచిర్యాల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధం అవుతోంది. జిల్లాలో ఇంకా పూర్తిస్థాయిలో వరి కోతలు ప్రారం భం కాకముందే సెంటర్ల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నారు. గతంలో కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలస్యం కావడంతో వర్షాలు పడి రైతులకు తీరని నష్టం వాటిల్లింది. దాన్ని దృష్టిలో ఉంచుకొని అధికారులు ముందస్తుగా చర్యలు చేపట్టేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

పెరిగిన వరి సాగు...

గత సంవత్సరంతో పోలిస్తే ఈ సారి రబీ సీజన్‌లో వరి సాగు జిల్లాలో ఘననీయంగా పెరిగింది. జిల్లాలో లక్షా 21వేల 702 ఎకరాల్లో వరి పంట సాగైంది. ఇందులో దొడ్డు రకం లక్షా 14 వేల 774 ఎక రాలు కాగా, సన్నరకం 6928 ఎకరాల్లో సాగైంది. గత సీజన్‌లో లక్షా 75 వేల మెట్రిక్ టన్నులు అంచనా వేయగా, ఈ సీజన్‌లో ఏకంగా 3 లక్షల 40వేల 301 మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వే స్తున్నా రు. ఇందులో దొడ్డు రకం 3 లక్షల 23వేల 639 మెట్రిక్ టన్నులు కాగా, సన్నరకం ధాన్యం 16 వేల 662 మెట్రిక్ టన్నులు వస్తుందని భావిస్తున్నారు. కొంత మంది మిల్లరు నేరుగా ధాన్యం సేకరించే అవకాశం ఉండటంతో కొనుగోళ్ల లక్ష్యం కొంతమేర తగ్గుతుందని అధికారులు భావిస్తున్నారు.

పనిచేసిన బోనస్ మంత్రం....

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సన్నరకం వరి ధాన్యం సాగును ప్రోత్స హించేందుకు రైతులకు అధనంగా క్వింటాలుకు రూ. 500 బోనస్ ప్రకటించింది. గత సీజన్ నుంచి ప్రారంభమైన బోనస్ చెల్లింపులు యాసంగి సీజన్‌లోనూ కొనసాగించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. దీంతో ధాన్యం క్వింటా ధర సగటున రూ. 2800 వరకు గిట్టుబాటు అవుతుండటంతో రైతులు సన్నరకాల సాగువైపు మొగ్గు చూపారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా సన్నాలకు బోనస్ అందడంతో యాసంగిలో రైతులు సన్నాల సాగువైపే మొగ్గు చూపారు.

321 కేంద్రాల ఏర్పాటుకు...

యాసంగి. సీజన్‌లో వరి ధాన్యం కొనుగోలుకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా డీఆర్‌డీఏ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 361 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు. గత సీజన్‌లో డీఆర్‌డీఏ (ఐకేపీ) ఆధ్వర్యంలో మొత్తం 320 కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినా ధాన్యం దిగుబడి మేరకు 315 సెంటర్లు ఏర్పాటు చేసి, ధాన్యం కొనుగోలు చేశారు.

ఈ సంవత్సరం ఆయా ఏజెన్సీల ఆధ్వర్యంలో 361 కేంద్రాలు ప్రారంభించాలని నిర్ణయించారు. డీఆర్‌డీఏ ఆధ్వ ర్యంలో 194, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 121, మెప్మా ఆధ్వర్యంలో 06 కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఆయా కేంద్రాల్లో ఆన్‌లైన్ విధానంలో ధాన్యం కొనుగోళ్లు చేయనున్నారు. ఈ మేరకు సెంటర్ నిర్వాహకులకు అవసరమైన శిక్షణ పూర్తి చేశారు. లక్ష్యం మేర కు ధాన్యం కొనుగోలు కోసం మొత్తం 57 లక్షల గన్నీ సంచులు అవసరం కాగా 20వేల వరకు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. మిగతా పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతుల కోసం మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

ఇతర ప్రాంతాల నుంచి తరలింపునకు చెక్...

జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాలకు ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుంచి ధాన్యం తరలింపు జరుగకుండా పకడ్బందీ

మిగతా 9వ పేజీలో



గూడెంగుట్టలో గిరి ప్రదక్షిణ



ఆలయ సింహద్వారం వద్ద గిరి ప్రదక్షిణ ప్రారంభిస్తున్న స్వాములు

దండేపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలం గూడెంగుట్ట దేవస్థానంలో హనుమాన్ జయంతిని పురస్కరించుకుని గూడెం గుట్ట చుట్టూ అంజన్న స్వాములు శనివారం భక్తిశ్రద్ధలతో గిరి ప్రదక్షణ చేపట్టారు. ముందుగా అంజనేయస్వామి దేవాలయంలో స్వాములు అభిషేకం పూజలు నిర్వహించారు. అనంతరం సత్యదేవుడి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ఆలయ సింహద్వారం నుంచి గిరి ప్రదక్షిణ నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అర్చకులు శ్రీపెరం బుందూరి హరీష్, సతీష్, తిరుపతి, చందు, అంజి, లింగన్న, శ్రీకాంత్, కిషన్ పాల్గొన్నారు.

ఎస్టీపీపీలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి

జైపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని శనివారం ఎస్టీపీపీలోని బ్యాచిలర్ ట్రైనీ హాస్టల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతూ రక్తదానం ప్రాణదానంతో సమానమన్నారు. ఈ శిబిరంలో 95 మంది రక్తదానం చేశారన్నారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ అధికారులు కె. శ్రీనివాసులు, జేఎన్ సింగ్, మదన్‌మోహన్, సముద్రాల శ్రీనివాస్, పంతుల నాయక్, సూపరింటెండెంట్ డాక్టర్ రవీందర్, డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి మొక్కలు పెంచుతున్న బాలుడి అరెస్టు



రివార్డు అందజేస్తున్న ఏసీపీ

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దీపక్ నగర్‌లో గంజాయి మొక్కలు పెంచుతున్న బాలుడిని మందమర్రి పోలీసులు శనివారం అరెస్టు చేశారు. ఈ మేరకు బెల్లంపల్లి ఏసీపీ రవి కుమార్ వివరాలను వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు దీపకనగర్‌లోని ఇంటిని తనిఖీ చేయగా గంజాయి మొక్కలు దొరికాయన్నారు. 12 మొక్కలను స్వాధీనం చేసుకొని సాగుచేస్తున్న బాలుడిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గంజాయి మొక్కలను గుర్తించిన పోలీసు సిబ్బందికి ఏసీపీ రివార్డును అందజేశారు. సమావేశంలో సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్ఐ రాజశేఖర్, రామకృష్ణపూర్, దేవాపూర్ పాల్గొన్నారు.

బహిరంగ సభ ప్రదేశాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే



గ్రౌండ్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు

మంచిర్యాలక్రైం, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల బాలుర పాఠశాల మైదానంలో ఈ నెల 14న జరగబోయే ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనే బహిరంగ సభ ప్రదేశాన్ని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు శంఖుస్థాపన కార్యక్రమాలకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు మంత్రులు, వస్తున్నారని సభను విజయవంతం చేసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూదరి తిరుపతి, చిట్ల సత్యనారాయణ, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

సకాలంలో యూనిఫాంలు అందజేయాలి

జైపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు యూనిఫాంలనుకుట్టి సకాలంలో అందించాలని ఐకేపీ ఏపీఎం రాజ్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎంఈవో కార్యాలయంలో ఐకేపీ మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 37 పాఠశాలల్లోని 2094 మంది విద్యార్థులకు యూనిఫాంలు దుస్తులు కట్టి అందించాలన్నారు. ఒక యూనిఫాం కుడితే రూ. 75 ప్రభుత్వం అందిస్తుందని, ఇది మహిళలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళ సంఘాల ద్వారానే కుట్టించాలని నిర్ణయించిందన్నారు. స్కూల్ యూనిఫాం బాటమ్ క్లాత్ మహిళ సంఘాలకే ఇవ్వడం జరుగుతుందన్నారు. గత సంవత్సరం కూడా ఐకేపీ మహిళలకే యూనిఫాంలు కుట్టారని తెలిపారు. ఉపాధ్యాయులు అనురాధ, శ్యాం సుందర్, పోశెట్టి, టైలర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్

మందమర్రిరూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తుం దని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో శనివారం బీజేపీ నాయకులు గావ్ చలో కార్యక్రమాన్ని మండల అధ్యక్షుడు గిర్నాటీ జనార్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పాల్గొన్నారు. గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం స్వచ్ఛత పరిశుభ్రత కార్యక్ర మాలను చేపట్టారు. ఆయన మాట్లాడు తూ కేంద్ర పథకాలతోనే ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారన్నారు. అనంతరం ప్రధాని మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవరనేని సంజీవరావు, శివకృష్ణ, వంశీ గౌడ్, రంజిత్, శ్రీనివాస్, రవికుమార్, రాజయ్య, బుచ్చన్న, లచ్చన్న పాల్గొన్నారు.

లక్షెట్టిపేట: భారత ప్రధాని నరేంద్ర మో దీతోనే పట్టణాలు, గ్రామాలు అభివృద్ధి అవుతుందని బీజేపి జిల్లా నాయకుడు మోట పల్కుల తిరుపతి అన్నారు. శనివారం పట్ట ణంలోని భగత్‌సింగ్‌నగర్‌లో గావ్ చలో బస్తీ, చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా నాయకులతో కలిసి పర్యటించారు. కాలనీ వాసులను పలు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో బీజేపి పట్టణ అధ్య క్షుడు వీరమల్ల



పరిసరాలను శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

హరిగోపాల్‌రావు, నాయకులు రమేష్ చంద్, గుండ ప్రభాకర్, నరేష్ చంద్, వెంకటరమణ, ముష్కం గంగన్న, పాంచాల రమేష్, గంగన్న, వెంకటస్వామి పాల్గొన్నారు.

మంచిర్యాలక్రైం: దేశ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని బీజేపీ కేంద్రశక్తి ఇన్‌చార్జి రాజమౌళి అన్నారు. పాత మంచిర్యాలలో గావ్‌చలో బస్తీచలో భాగంగా పాత మంచిర్యాలలో బీజేపీ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. లచ్చన్న, పురుషోత్తం, కృష్ణమూర్తి, గురువయ్య, రవీందర్‌యాదవ్, నరేందర్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

తాండూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి పనులకు శనివారం అధికారులు, నాయకులు శంకుస్థాపన చేశారు. అచ్చలాపూర్ గ్రామంలోని బ్రహ్మణవాడలో సీసీ రోడ్డు, స్మశాన వాటికకు కాంపౌండ్ వాల్ నిర్మాణ పనులను ఎంపీడీవో శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ విష్ణువర్ధన్‌లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మురళీధర్‌రావు నాయకులు పూదరి కృష్ణగౌడ్, కొండ శ్రీనివాస్, దాగం పోచయ్య, బేగం పాపయ్య, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

విరిగిన చెట్టును తొలగించండి

కాసిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం కురిసిన గాలివాన భీభత్సానికి చెట్లు నేలకొరిగాయి. కాసిపేట నుంచి సోమగూడెం వెళ్లే రహదారిపై చెట్లు నేలకూలడం వల్ల వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సంద్రల్‌పాడ్ సమీపంలో చెట్టు గాలికి విరిగి పడింది. సంబంధితశాఖ అధికారులు చెట్టు కొమ్మలను తొలగించకపోవడంతో వాహనదారులు, సింగరేణి కార్మికులు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ అధికారులు స్పందించి చెట్టును వెంటనే తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. చెట్టు తొలగించకపోవడం వల్ల భారీ వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు.

23 నుంచి భారత్ గౌరవ్ టూరిస్టు రైలు



బ్రోచర్లను విడుదల చేస్తున్న ఐఆర్‌సీటీసీ మానిటర్స్

గర్మిళ్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాలను దర్శించుకోవాలనుకున్న వారి కోసం సమ్మర్ స్పెషల్ టూరిజం ప్యాకేజీ కింద ఈ నెల 23న మంచిర్యాల నుంచి ప్రత్యేక తొలి భారత్ గౌరవ్ రైలును ప్రారంభిస్తున్నట్లు ఇండియన్ రైల్వే కేటరింగ్ అండ్ టూరిజం కార్పొరేషన్ మానిటర్స్ ప్రశాంత్, శ్రీకాంత్ పేర్కొన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో సంబంధిత బ్రోచర్‌లను విడుదల చేశారు. వారు మాట్లాడుతూ ప్రయాణికుల కోసం రైలులు అన్ని వసతులతో కూడిన సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. టికెట్ల కోసం ఐఆర్‌సీటీసీటూరిజం.కామ్‌లో బుకింగ్ చేసుకోవాలని సూచించారు. ఈ నెల 23 నుంచి మే 2 వరకు ప్యాకేజీ 1లో హరిద్వార్, రిషికేష్, అనంతపూర్ సాహిబ్ అమృత్‌సర్, మాత వైష్ణోదేవి యాత్ర కొనసాగుతుందని, టికెట్ ధర రూ. 18,510తో ప్రారంభపు ధర ఉంటుందని, ప్యాకేజీ 2కు సంబంధించి మే 5 నుంచి 17 వరకు పూరి, గయ, వారణాసి, అయోధ్య, ప్రయాగ్ రాజ్ టికెట్ ధర రూ. 16,800, ప్యాకేజీ 3 మే 22 నుంచి 30 వరకు తిరువనమైల, రామేశ్వరి, మధురై, కన్యాకుమారి, త్రివేంద్రం, తం జాపూర్ టికెట్ ధర రూ. 14,700 ఉంటుందని తెలిపారు. అలాగే ప్యాకేజీ 4 జూన్ 3 నుంచి 11 వరకు ఉజ్జయిని, నాగ్‌పూర్, నాసిక్, పూణె, ఔరం గాబాద్, మోవాటికెట్ ధర రూ. 14,700 ధర ఉంటుందని తెలిపారు. వివరాలకు 040-27702407, 97013 60701, 9281030711, 9281030749లో సంప్రదించాలన్నారు.

మహాప్రస్థానాన్ని సందర్శించిన విద్యార్థులు



మహాప్రస్థానం వద్ద విద్యార్థులు

మంచిర్యాలక్రైం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి):మంచిర్యాల పట్టణం కాలేజీ రోడ్డులో గల మహాప్రస్థానాన్ని సీవిరామన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా మహాప్రస్థానం సముదాయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మహాప్రస్థానంలో ఉన్నత ప్రమాణాలతో కాలుష్యరహితంగా సోలార్ పవర్‌తో ఏర్పాటు చేయడం వల్ల దానికి విద్యార్థులు అధ్యయనం చేశారు. అక్కడున్న వసతులను దేశంలోనే మొట్టమొదటిసారిగా నూతన టెక్నాలజీని పరిశీలించారు. దానిపై ప్రాజెక్టు రిపోర్టును తయారు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావుకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు.

మహనీయుల అడుగు జాడల్లో నడవాలి

జన్నారం, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరు మహనీయుల అడుగు జాడల్లో నడవాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భుక్య జాన్సన్ నాయక్ అన్నారు. శనివారం జన్నారం మండల కేంద్రంలోని ఆర్ఆర్ఎస్ బంకెట్ హాలులో తెలంగాణ నేతకాని మహర్ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయిని ప్రసాద్ నేత ఆధ్వర్యంలో నిర్వహించిన మహనీయుల జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. ముందుగా మండల కేంద్రంలోని సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్, ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బస్టాండ్ నుంచి బంకెట్ హాల్ వరకు ద్విచక్రవాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్, జగ్జీవన్ రామ్, పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీఆర్ అంబేద్కర్, పూలే, జగ్జీవన్‌రామ్‌లు అణగారిన సమాజ అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశారన్నారు. ఉత్సవాలను నిర్వహించిన సాయిని ప్రసాద్ నేతను అభినందించారు.

- రానున్న రోజుల్లో బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, కేటీఆర్ క్లాస్‌మేట్ అయిన భూక్య జాన్సన్ నాయక్ మంత్రి అవడం ఖాయ మని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. ఆయన మాట్లాడు తూ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయ డానికి జాన్సన్ నాయక్ ఎంతో కృషి చేశారని తెలి పారు. కార్యక్రమంలో నాయకులు రాజారాంరెడ్డి, జనార్ధన్, భరత్‌కుమార్, లక్ష్మీనారాయణ, నర్సగౌడ్, నర్సింహులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జాన్సన్ నాయక్

అంబేద్కర్ జయంతిని ఘనంగా నిర్వహించాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న అంబేద్కర్ జయంతిని అన్ని గనులు, డిపార్టుమెంట్ల వద్ద ఘనంగా నిర్వ హించాలని ఎస్‌వోటూ జీఎం విజయ్‌ప్రసాద్ పేర్కొ న్నారు. శనివారం స్థానిక జీఎం కార్యాలయం లోని ఆయన చాంబర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. స్థానిక సింగరేణి పార్కులోని అంబే ద్కర్ విగ్రహం వద్ద జయంతి కోసం ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సింగరేణి సీఎండీ బలరాం సందేశాన్ని అందిస్తారని తెలిపారు. జయంతి సందర్భంగా సెలవుదినం ఉన్నందున ఉద్యోగులు, అధికారులు, దళిత సంఘాలు వేడుకల్లో పాల్గొనాలని కోరారు. ఈ సమావేశంలో పర్సనల్ మేనేజర్ శ్యాం సుందర్, ఎస్సీ లైజన్ ఆఫీసర్ మైత్రేయబంధు, డీవైపీఎం ఆసీఫ్, రాజలింగు, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్‌వోటూ జీఎం విజయ్ ప్రసాద్

ఘనంగా అంబేద్కర్ జయంతి

కోటపల్లి : మండల కేంద్రంలోని పీఎంశ్రీ మోడల్‌స్కూల్, కళాశాల లో శనివారం అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జీ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. అంబేద్కర్ ఆశయాలను గుర్తుచేసుకున్నారు. ఉపాధ్యాయులు చంద్రమౌళి, ఏవీ రమణ, సలీం పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వృద్ధురాలు మృతి



రాజవ్వ(ఫైల్)

దండేపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో ముత్తె రాజవ్వ(70) అనే వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై తహసీయొద్దీన్ తెలిపారు. పోలీసులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజవ్వ తన ఇంటి వెనకాల పెరట్లో బెండతోట సాగు చేశారు. రోజూ ఉదయం పెరట్లోకి కోతులు రావడంతో అవి కొట్టడానికి వెళ్లింది. తిరిగి ఇంట్లోకి వస్తున్న క్రమంలో ఇంటి ఆవరణలో కూలర్ వైర్లు తెగి జాయింట్ కావడంతో ఆ వైర్లకు వేసిన ప్లాస్టర్ ఊడిపోయింది. గమనించకుండా వస్తున్న రాజవ్వకు కూ లర్ వైరు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందింది. రాజవ్వకు భర్త, ఏడుగురు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. భర్త రాయలింగయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

గాయపడ్డ గీత కార్మికుడి మృతి



రాకేష్‌గౌడ్(ఫైల్)

వేమనపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తాటి చెట్టుపై నుంచి పడి గాయాలపాలైన మండలంలోని దస్నాపూర్ గ్రామానికి చెందిన తాళ్లపెల్లి రాకేష్‌గౌడ్(28) అనే గీత కార్మికుడు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో శనివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం రాకేష్ గౌడ్ కోటపల్లిలో తాటి చెట్లను కౌలుకు తీసుకుని జీవనోపాధి పొందుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం కోటపల్లిలో కల్లు తీయడానికి తాటి చెట్టు ఎక్కగా కాళ్లకు ఉన్న తాడు జారిపోవడంతో చెట్టుపై నుంచి కింద రోడ్డుపై పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో చెన్నూరులోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కుటుంబీకులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందినట్లు తెలిపారు. రాకేష్‌గౌడ్‌కు ఇంకా వివాహం కాలేదు. మృతుడి తండ్రి పదేళ్ల క్రితమే అనారోగ్యంతో మృతిచెందగా రాకేష్‌గౌడ్ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రాకేష్‌గౌడ్‌కు తల్లి, తమ్ముడు, చెల్లెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా చెట్లను నరికిన ఏడుగురి అరెస్టు

కన్నెపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రెబ్బెన గ్రామ శివారులోని సర్వే నెంబరు 248లోని ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఎలాంటి అనుమతులు లేకుండా చెట్లను నరికిన ఏడుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు కన్నెపల్లి ఎస్‌ఐ గంగారాం తెలిపారు. శనివారం పోలీస్ స్టేషన్‌లో వివరాలను వెల్లడించారు. ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా అక్రమంగా చెట్లు నరికారని తహసీల్దార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితులు మేసినేని చంద్రయ్య, ధరావత్ రాజ్‌కుమార్, గట్టు అంకులు, జంబి దిలీప్, బోరె కాంతయ్య, దుర్గం రామకృష్ణ, జంబి రాజ్‌కుమార్‌లను అరెస్టు చేసినట్లు తెలిపారు.

గంజాయి సేవిస్తున్న నలుగురి అరెస్టు

నెన్నెల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): నిషేధిత గంజాయి కలిగి ఉన్న నలుగురు యువకులను జెండావెంకటాపూర్ శ్మశాన వాటిక వద్ద శనివారం పట్టుకున్నామని నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపారు. కొందరు యువకులు గంజాయి సేవిస్తున్నారని తమకు అందిన పక్కా సమాచారం మేరకు దాడి చేశామని చెప్పారు. జెండావెంకటాపూర్‌కు చెందిన ఎస్కూరి శశికుమార్, దుర్గం సిద్దు, భీమారం మండలం ఖాజిపల్లికి చెందిన కుంటాల కీర్తివర్ధన్, జగతి మనోహర్‌లను పట్టుకొని సోదాలు చేయగా వారి వద్ద 250 గ్రాముల గంజాయి లభించిందన్నారు. గంజాయితో పాటు వారి నుంచి ఒక రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని వివరించారు. నిషేధిత గంజాయి విక్రయించే వారిపై, సేవించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

ఫేక్ అకౌంట్‌తో బురిడి కొట్టించి డబ్బులు మాయం

జైపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఫేస్‌బుక్‌లో మెసేజ్ చేసి బురిడి కొట్టించి లక్ష రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేసిన ఘటన శనివారం వెలుగుచూసింది. జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఇందారం గ్రామానికి చెందిన సయ్యద్ ఇలియాజ్ బంధువు సయ్యద్ జహీర్ సౌదీ అరేబియాలో నివాసం ఉంటున్నాడు. జహీర్ పేరుతో ఫేస్ బుక్‌లో ఫేక్ ఎకౌంట్‌తో మూడు నెలల నుంచి తరుచూ సయ్యద్ ఇలియాజ్‌కు మెసెజ్‌లు పంపుతూ బాగోగులు అడిగి తెలుసుకుంటున్నాడు. ఈ క్రమంలో మార్చి 10న తనకు వీసా సమస్య ఉందని లక్ష రూపాయలు కట్టాలని లేని యెడల తనను అరెస్టు చేస్తారని జహీర్ సయ్యద్ ఇలియాజ్‌కు మెసెజ్ పంపాడు. స్పందించిన ఇలియాజ్ ఫోన్‌పే ద్వారా లక్ష రూపాయలు పంపాడు. అదే రోజు సాయంత్రం తన బంధువు సయ్యద్ జహీర్‌కు ఫోన్ చేసి డబ్బులు పంపించాను చూసుకో అని చెప్పడంతో తనకు డబ్బులు రాలేదని అసలు తాను డబ్బులు అడగలేదని చెప్పడంతో ఇలియాజ్ షాక్‌కు గురయ్యాడు. మోసపోయానని గ్రహించి 1930కు ఫోన్ చేసి సైబర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశాడు. శనివారం జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నకిలీ బెడద



ట్రాన్స్‌పోర్టుల ద్వారా గ్రామాలకు నకిలీ పత్తి విత్తనాలు తరలింపు

అధికారులు దాడులు చేసినా అడ్డుకట్ట పడని వైనం

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో నకిలీ పత్తి విత్తనాల దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కర్ణాటక, ఖమ్మం, విజయవాడ కేంద్రంగా ఈ దందాను కొంత మంది దళారులు కొనసాగిస్తున్నారు. జిల్లాలో ఆసిఫాబాద్, సిర్పూరు నియోజకవర్గాల్లోని ఆయా గ్రామాల రైతుకు అందజేసేందుకు ఏకంగా ట్రాన్స్ పోర్టుల ద్వారా పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నకిలీ పత్తి విత్తనాలపై ఉక్కుపాదం మోపేందుకు చర్యలు తీసుకుంటున్నప్పటికీ అడ్డుకట్ట పడడం లేదు. కర్ణాటక, గుంటూరు, విజయవాడ ప్రాంతాల్లో పత్తి విత్తనాలు, ఎరువుల ఫ్యాక్టరీలున్నాయి. పత్తి విత్తనాల ఫ్యాక్టరీలో సరిగా లేనివన్నీ కూడా పక్కన పెట్టేస్తారు. వీటిని కొంత మంది దళారులు బియ్యం సంచుల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

సిర్పూరు, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో అధికంగా పత్తి పంటను వేస్తున్నారు. పేరొందిన బ్రాండెడ్ కంపెనీలకు చెందిన 100 గ్రాముల ప్యాకెట్ పత్తి విత్తనం ధర రూ.500 నుంచి రూ.1200 వరకు అమ్మకాలు సాగుతున్నాయి. ఖమ్మం, విజయవాడకు చెందిన నకిలీ పత్తి విత్తనాలు తీసుకొచ్చి కొంత మంది బ్రోకర్లు ఆయా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. నకిలీ విత్తనాలు కూడా కిలో చొప్పున ప్యాకెట్లు తయారు చేసి రూ. 3వేలకు అమ్ముతున్నారు. కౌరుచౌకగా గ్రామాల్లోనే లభ్యమవుతుండడంతో వీటినే రైతులు గుట్టుచప్పుడు కాకుండా దళారుల వద్ద కొనుగోలు చేస్తున్నారు. ఈ విత్తనాలు వాడితే పంటలో కలుపు మొక్కలు పెరగవని ప్రచారం చేయడంతో రైతులు కొనుగోలు చేస్తున్నారు.

ఇటీవల కాలంలో..

చింతలమానేపల్లిలో ఈ నెల 4న అమ్మకానికి నకిలీ పత్తి విత్తనాలు సిద్ధం చేసినట్లు పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు దాడులు నిర్వహించారు. 300 కిలోల నకిలి పత్తి విత్తనాలు లభించాయి. బీ-3 పేరుతో అమ్మకానికి సిద్ధంగా ఉంచారు. ఈ దందాను కొనసాగిస్తున్న ఆసిఫాబాద్‌కు చెందిన లోకండే భిక్షపతి, గుంటూరుకు చెందిన సురేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. కాగజ్‌నగర్ పట్టణంలో రెండు రోజుల క్రితం నవత ట్రాన్స్ పోర్టుపై టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేశారు. ఈ దాడుల్లో 45 కిలోల నకిలీ బీటీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయి. వీటిని తెచ్చిన కుశ్నపల్లి నివాసి చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశారు. వీటి విలువ రూ.1.57లక్షలున్నట్టు అధికారులు తేల్చారు. ఈ సంఘటనతో పోలీసులు, వ్యవసాయాధికారులు జిల్లాలో అన్ని ట్రాన్స్ పోర్టు గోడౌన్లపై దాడులు నిర్వహించారు. ఎలాంటి నకిలీ విత్తనాలు సరఫరా చేసిన కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీడ్స్ డీలర్లతో సమావేశం నిర్వహించి అధికారులు సూచనలు చేశారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు..

రామానుజం, కాగజ్‌నగర్ డీఎస్పీ

నకిలి పత్తి విత్తనాలు తెచ్చి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుం టాం. నకిలి విత్తనాలు పెడితే రైతు లకు నష్టం జరుగుతుంది. ఈ విషయాన్ని గమనించాలి. నకిలీ విత్తన దందాపై నిఘా పెట్టాం. పట్టుబడిన వారిపై చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి.

నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేయొద్దు

రామకృష్ణ, వ్యవసాయాధికారి, కాగజ్‌నగర్

రైతులు నకిలీ పత్తి విత్తనాలు కొనుగోలు చేయొద్దు. ఈ విత్తనాలు నాటడం వల్ల భూసారం దెబ్బ తింటుంది. పంట దిగుబడి కూడా రాదు. దీంతో రైతులకు నష్టం జరు గుతుంది. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.



చింతమానేపల్లిలో పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలు (ఫైల్)

యువకుడి మృతదేహం లభ్యం

సిర్పూర్(టి), ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): మూడు రోజుల క్రితం అదృశ్యమైన యువకుడి మృతదేహం శనివారం లభ్యమైంది. సిర్పూర్(టి) మండలం టోంకిని గ్రామానికి చెందిన చౌదరి జయేందర్(19) ఈ నెల 9న అదృశ్యమయ్యాడు. దీంతో మృతుడి తండ్రి చౌదరి చిరంజీవి సిర్పూర్(టి) పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్సై కమలాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శనివారం పెన్‌గంగా నదిలో మృతదేహం ఉందని తెలియడంతో కౌటాల సీఐ రమేశ్, ఎస్సై కమలాకర్ అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని బయటికి తీసి పరిశీలించి జయేందర్‌దిగా గుర్తించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. జయేందర్ మృతిపై గ్రామస్థులు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. జయేందర్ ఈ నెల 9న తన చేనుకు వెళ్లిన సమయంలో పంట రక్షణ కోసం అమర్చిన విద్యుత్ తీగలకు తగిలి మృతి చెంది ఉంటాడని చెబుతున్నారు. అటవీ శాఖాధికారులు వన్యప్రాణుల వేటకు విద్యుత్ తీగలు అమర్చి ఉంటారని కేసు పెడతారనే భయంతో జయేందర్ తండ్రి, వారి పక్క భూమి ఉన్న శరీరాం అనే వ్యక్తి సాయంతో మృతదేహాన్ని పెన్‌గంగా నదిలో పడేసి ఉంటారనే అనుమానిస్తున్నారు. ఈ మేరకు జయందేర్ తండ్రి చిరంజీవితో పాటు శరీరాంపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కమలాకర్ తెలిపారు.

పట్టణ పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు

అంజయ్య, మున్సిపల్ కమిషనర్



ఆంధ్రజ్యోతి: పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు తీసుకుంటున్న చర్యలు ఏంటి?

కమిషనర్: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలోని 30 వార్డుల్లో పారిశుధ్యం మెరుగుదలకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కాంట్రాక్టు కార్మికులు, పర్మినెంటు కార్మికులు, ఎన్ఎం ఆర్ కార్మికులకు వివిధ వార్డులను కేటాయించి చెత్తాచెదారం తొలగించేలా చర్యలు తీసుకుంటున్నాం. వార్డు అధికారులతో పర్యవేక్షణ చేయిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: వందశాతం ఆస్తి పన్ను వసూలుకు ఏం చర్యలు తీసుకుంటున్నారు?

కమిషనర్: వందశాతం ఆస్తి పన్ను వసూలుకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తున్నాం. సిబ్బంది బకాయిదారుల వద్దకే వెళ్లి పన్ను తీసుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: ప్రభుత్వ కార్యాలయాల ఆస్తిపన్ను ఎంత మేర వసూలయ్యాయి..?

కమిషనర్: కాగజ్‌నగర్ పరిధిలోని 18 ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించిన వాటికి ఆస్తి పన్ను నోటీసులను అందజేశాం. ఇందులో 60 శాతం మేర వివిధ కార్యాలయాల సిబ్బంది ఆన్‌లైన్‌లో చెల్లించారు. కట్టని వారికి మరో సారి నోటీసులు పంపించాం.

ఆంధ్రజ్యోతి: డ్రైనేజీల్లో పూడికతీత పనులు ఎప్పుడు ప్రారంభిస్తారు?

కమిషనర్: వేసవిలోనే డ్రైనేజీల్లో పూడికతీత పనులు పూర్తి చేయిస్తాం. కాగజ్‌నగర్ ఎన్టీఆర్ చౌరస్తా నుంచి మార్కెట్ ఏరియా మీదుగా వెళ్లే ప్రధాన పెద్ద మురికి కాల్వ చెత్తాచెదారం తొలగింపు పనులకు త్వరలోనే చేపడుతాం.

- కాగజ్‌నగర్, ఆంధ్రజ్యోతి

కేస్లాపూర్ ఆలయంలో ప్రత్యేక పూజలు.. హోమం



హోమంలో పాల్గొన్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ హనుమాన్ ఆలయంలో శనివారం హనుమాన్ చిన్న జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు హోమం నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి శిరీష్ శర్మ, అర్చకులు శ్రీనివాస్, రాజు, నరేష్, మహేష్, పూర్ణచందర్, శేఖర్‌ల ఆధ్వర్యంలో. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. ఉదయం 5 గంటల నుంచి సుప్రభాత సేవతో ప్రార ంభమై కలశ పూజ, ధ్వజారోహణం, సహస్ర పుష్పార్చన, నవగ్రహ పూజ, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించారు. హనుమాన్ ఆలయంలో నిర్వహి ంచిన వేడుకల్లో కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో పాటు ఎమ్మెల్యే కోవ లక్ష్మి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, బీజేపీ నాయకుడు అరిగెల నాగేశ్వర్ రావు, నాయకులు బాలేష్‌గౌడ్, మల్లేష్, వెంకన్న, రమేష్, వెంకన్న, చరణ్ తది తరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కలెక్టర్ వెంకటేష్ దోత్రేతో పాటు ఎమ్మెల్యే కోవ లక్ష్మిని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు అధ్యక్షతన సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.10 లక్షల సీఎస్ఆర్ నిధులతో ఆలయంలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని అన్నారు. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందో బస్తు ఏర్పాటు చేశారు. పలువురు సేవా కార్యక్రమాలు నిర్వహిం చారు. స్థానిక వ్యాపారి సాయిని సంతోష్ కుటుంబ సభ్యులు, మైనార్టీ అసోసియేషన్ ఆధ్వర్యంలో తాగునీటిని, ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు



కర్జవెల్లిలో గోడలపై అంటించిన పోస్టర్

బెజ్జూరు/చింతలమానేపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-చత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో ఉన్న కర్రెగుట్టలపైకి ప్రజలెవరూ రావొద్దని, ఆపరేషన్ కగార్ పేరుతో జరుగుతున్న దాడుల నుంచి స్వీయ రక్షణ కోసం గుట్ట చుట్టూ బాంబులు పెట్టామని మావోయిస్టులు నాలుగు రోజుల క్రితం ఓ ప్రకటనలో హెచ్చరించడంతో వారికి వ్యతిరేకంగా బెజ్జూరు, చింతలమానేపల్లి మండలాల్లో పోస్టర్లు అంటించడం చర్చనీయాంశమైంది. బెజ్జూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన పాఠశాల, ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడలకు ఆదివాసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర పేరిట పోస్టర్లు అంటించారు. చింతలమానేపల్లి మండలం కర్జవెల్లి, రవీంద్రనగర్, కౌటాల మండలలో గోడలకు గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లను అంటించడం కలకం సృష్టిస్తున్నాయి. ఆదివాసీల జీవనాధారమైన అడవుల్లోకి వెళ్లకుండా బాంబులు పెట్టి అడ్డుకుంటారా అంటూ ప్రశ్నించారు. స్థానిక పోలీసులు పోస్టర్లు అంటించిన విషయంపై ఆరా తీస్తున్నారు. ఈ విషయమై బెజ్జూరు ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ను సంప్రదించగా పోస్టర్లు అంటించిన విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ చేపడుతున్నామని తెలిపారు.



కార్మికులకు ఇచ్చిన హామీలపై పట్టింపు కరువు



మాట్లాడుతున్న ఐఎన్‌టీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కార్మిక గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఎన్నికల ముందు కార్మికులకు ఇచ్చిన హామీలపై పట్టింపు కరువైందని ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య అన్నారు. శనివారం మందమర్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కార్మికులకు సొంతింటి కల నెరవేరుస్తామని, మారుపేర్లు మార్పిస్తామని, ఇన్‌కంటాక్స్‌రద్దుకు కృషి చేస్తామని చెప్పి గెలిచిన తర్వాత మర్చిపోయిందన్నారు. దాదాపు సంవత్సరానికి పైగా కావస్తున్నా ఏ ఒక్క హామీ అమలు కాలేదన్నారు. . సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

సింగరేణి వ్యాప్తంగా నీటి కుంటల ఏర్పాటు

జైపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వ్యాప్తంగా 50 నీటి కుంటల ఏర్పాటుకు సింగరేణి సీఎండీ బలరాం అంగీకారం తెలిపారని శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఇందారం ఐకే1ఏ గని లో శనివారం నీటికుంటల నిర్మాణం కోసం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఐకే ఓసీపీ అధికారి ఏవీ రెడ్డి, గని మేనేజర్ రవికుమార్, గని రక్షణాధికారి సతీష్, ఎన్విరాన్‌మెంట్ అధికారి హనుమాన్‌గౌడ్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల పనివేళలు మార్చాలి



జూనియర్ ఫారెస్ట్ అధికారికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

శ్రీరాంపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరే ణి పార్కులు, నర్సరీలలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల పనివేళలు మార్చాలని సింగరేణి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ ఏరియా అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో జూనియర్ ఫారెస్ట్ అధికారి మేఘనకు వినతిపత్రం అందించారు. ప్రస్తుత వేసవి కాలంలో ఎండలు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. సింగరేణి ఫారెస్ట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పార్కులు, నర్సరీలలో పలువురు కాంట్రాక్టు కార్మికులు పనిచేస్తున్నార న్నారు. వీరు ఎండలో విధులు నిర్వర్తిస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అంతేకాకుండా తీవ్ర అలసటకు గురవుతున్నా రని తెలిపారు. ఓఆర్ఎస్, మజ్జిగ ప్యాకెట్లు అందించాలన్నారు. కార్యక్ర మంలో యూనియన్ ఏరియా ఉపాధ్యక్షులు రాచర్ల చంద్రమోహన్, కాతిరాజు ప్రభాకర్, నర్సరీ కాంట్రాక్ట్ యూనియన్ అధ్యక్షురాలు బర్ల స్వప్న, కొట్టె లక్ష్మి, జమ్మి లక్ష్మీ, గడిచెర్ల స్వరూప తదితరులు పాల్గొన్నారు.

పోస్టింగ్ ఆర్డర్లు అందజేయాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): కారుణ్య నియామకాలలో భాగంగా 35 ఏళ్ల నుంచి 40 ఏళ్ల వయస్సు వారికి వెంటనే పోస్టింగ్ ఆర్డర్లు అందజేయాలని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా శనివారం ఒక ప్రకటనలో కోరారు. వయస్సు పెంచి ఉద్యోగాలు ఇవ్వడం తమకు సంతోషంగా ఉందని తెలిపారు. ఆర్డర్లు సిద్ధం చేసిన ప్పటికీ రాజకీయ నాయకులతో ఇప్పిం చేందుకు యాజమాన్యం ఏర్పాట్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు. ఇది ఎంత మాత్రం సరికాదని, రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా ఇవ్వాలని కోరారు.

విశ్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): సింగరేణి విశ్రాంత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సింగరేణి విశ్రాంత కార్మికుల సంక్షేమ సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఆళవందార్ వేణుమాధవ్ కోరారు. ఈ మేరకు ఆయన ఎమ్మెల్సీ విజయశాంతిని ఆమె స్వగృహంలో శనివారం కలిసి విన్నవించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన సందర్భంగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఎన్నో ఏళ్ల పాటు సింగరేణిలో పనిచేసి రిటైర్ అయిన కార్మికులు పలు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. వాటి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. సింగరేణి కార్మికుల కష్టాలు తనకు తెలుసునని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విజయశాంతి హామీ ఇచ్చారని వేణుమాధవ్ తెలిపారు. అయన వెంట విశ్రాంత కార్మికుడు ఎం బాబురావు ఉన్నారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల వైఖరిని ఎండగట్టాలి

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో గుర్తింపు ప్రాతినిధ్య సంఘాలైన ఏఐటీయూసీ, ఐఎన్‌టీయూసీల వైఖరిని కార్మికులు ఎండగట్టాలని సీఐటీయూ జాతీయ కార్యదర్శి అల్లి రాజేందర్ అన్నారు. మందమర్రిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. ఇప్పటి వరకు ఈ రెండు యూనియన్‌లు సింగరేణిలో కార్మికులకు సాధించి పెట్టింది ఏమి లేదన్నారు. త్వరలోనే సింగరేణి వ్యాప్తంగా అనేక పాత గనులు మూత పడే దిశలో ఉన్నాయని, నూతన గనులకు సంబంధించి ఊసే లేదని చెప్పారు. నూతన గనుల ఏర్పాటు కోసం, ఇన్‌కంటాక్స్ రద్దు కోసం, సీఐటీయూ పోరాటాలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో వెంకటస్వామి పాల్గొన్నారు.

బీజేపీ నాయకులపై కేసు నమోదు

జైపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా రేషన్ షాపు తెరిచి బియ్యం పంపిణీ చేసిన ఘటనలో డీలర్ ఫిర్యాదు మేరకు మండల బీజేపీ నాయకులు ప్యాగ లవకుమార్, వేముల తిరుపతిగౌడ్, ప్యాగ మొగిలి, వేముల రమేష్ గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు జైపూర్ ఎస్ఐ శ్రీధర్ శనివారం తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 10న వేలాల గ్రామానికి చెందిన రేషన్ డీలర్ వడ్లకొండ తిరుపతి ఇంట్లో లేని సమయంలో బీజేపీ నాయకులు ప్రవేశించి తిరుపతి భార్యను బెదిరించి తాళాలు లాక్కుని రేషన్ షాపును తెరిచి బియ్యం పంపిణీ చేశారని పేర్కొన్నారు. రేషన్ డీలర్ తిరుపతి ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

క్వార్టర్ల కేటాయింపునకు ఉద్యోగులకు కౌన్సెలింగ్

శ్రీరాంపూర్, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): క్వార్టర్లు కేటాయించేందుకు సింగరేణి ఉద్యోగులకు జీఎం కార్యాలయంలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించారు. సీ-2 టాప్ క్వార్టర్ల కోసం వచ్చిన ఉద్యోగులు సీనియారిటీని పరిశీలించి 9 మందికి క్వార్టర్లు కేటాయించారు. నిబంధనల ప్రకారమే కేటాయించామని తెలిపారు. కార్యక్రమంలో డీజీఎం (పర్సనల్) అరవిందరావు, డీజీఎం (సివిల్) ఆనంద్ కుమార్, డిప్యూటీ పర్సనల్ మేనేజర్ దేవేందర్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ ఎల్ శ్రీధర్ పాల్గొన్నారు.

కలకాలం.. మధుర జ్ఞాపకం

పెళ్లంటే పందిళ్లు..తాళాలు..తలంబ్రాలు.. మూడే ముళ్లు.. ఏడడుగులు..మొత్తం కలిసి నూరేళ్లు.. ఇది పాత ట్రెండ్.. ఇప్పటి పెళ్లిళ్లలో వీటితో పాటు మరికొన్ని జొడయ్యాయి. ప్రీ వెడ్డింగ్ షూట్, హల్దీ ఫంక్షన్, మెహందీ..సంగీత్ అంటూ పెళ్లి తంతుకు ముందు ఐదు రోజుల పాటు పెళ్లింట్లో సందడి చేస్తున్నారు. ప్రత్యేకంగా ప్రీ వెడ్డింగ్ షూట్‌లకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. లక్షల్లో ఖర్చు అయినా వెనుకాడకుండా కాబోయే కొత్త జంటలు మంచి మంచి ప్రదేశాలకు వెళ్లి వెడ్డింగ్ షూట్‌లలో మునిగి తేలుతున్నారు.









జిల్లాలో పెరుగుతున్న ప్రీ వెడ్డింగ్ షూట్స్...

షూటింగ్‌లకు లక్షల్లో ఖర్చు...

ప్యాకేజీలపేరిట ఫొటో గ్రాఫర్ల ఆఫర్లు...

వెడ్డింగ్ షూట్‌లపై కొత్త జంటల మోజు...

ఆదివారం ప్రత్యేకం

నస్పూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వివాహం అంటే ఎల్లప్పుడు గుర్తుండే మధుర జ్ఞాపకంగా నిలిచే వేడుక. పెళ్లంటే పందిళ్లు, తప్పెట్లు, తాళాలు, తలంబ్రాలూ మూడు ముళ్లు, ఏడడుగులు అందరికీ తెలిసిన విషయమే. సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో అత్యాధునిక కెమెరాల ద్వారా విధంగా పెళ్లిళ్ల సన్ని వేషాల చిత్రీకరణ జరుగుతున్నాయి. ఏ శుభకార్యమైన ప్రత్యేకంగా ఫొటో షూట్ తప్పని సరిగా మారింది. జిల్లాలో ఫొటో షూట్‌ల సందడి బాగా పెరిగిపోతోంది. ప్రీ వెడ్డింగ్ షూటింగ్ చిన్నపాటి సినిమా పాటను తలపిస్తోంది. పెళ్లి సంబరాలు, మధుర సన్నివేషాలు చెదరని జ్ఞాపకంగా జీవితాంతం గుర్తుండి పోయే విధంగా యువతీయువకులు మక్కువ చూపు తున్నారు. దీంతో పెళ్లి వేడుకలు కొత్త పుంతలు తొక్కుతోంది. సినిమా షూటింగ్‌లు జరిగే ప్రాంతాలను ఇష్టపడుతున్నారు. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లి చిత్రీకరణ చేయాల్సివస్తోంది. ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్, సాంగ్ షూటింగ్‌ల్లో వెరైటీ ఫోజుల్లో నూతన జంటలు ప్రత్యేక ఆకర్షణగా కనిపిస్తున్నారు.

షూటింగ్ అద్భుతం...

మధుర ఘట్టమైన వివాహ వేడుకను భద్రంగా దాచుకోవానికి ఫొటో, వీడియో షూట్స్ ద్వారా తమ ప్రేమను, అనుబంధాన్ని ప్రదర్శించడం ఒక అనుభూతి. శాశ్వత జ్ఞాపకాలను సృష్టించే వ్యక్తిత్వాలను శైలిని ప్రదర్శించే ఒక అవకాశం. ఎంత ఖర్చయినా సరే మధుర వేడుకను వీడియో, ఫొటోల్లో దాచుకుంటున్నారు. చాలా మంది ప్రీ వెడ్డింగ్‌షూట్లకు అధిక ప్రాధాన్యత కల్పించడంతో పెళ్లికి ముందుగానే ప్రీ వెడ్డింగ్, ఫొటో షూట్లకు సిద్ధమవుతున్నారు. పెళ్లికి కొద్ది రోజుల ముందు, వివాహం అయినా తర్వాత నూతన వధూవరులతో పాటు కుటుంబ సభ్యులతో కలిపి ప్రత్యేకంగా ప్రీ వెడ్డింగ్ షూట్, పోస్ట్ వెడ్డింగ్ షూట్స్ ద్వారా ఫొటో, వీడియో చిత్రీకరణ చేస్తారు. జిల్లాలో 1450 మంది ఫొటో గ్రాఫర్లుండగా నస్పూర్ పట్ట ణంలో నే 132 మంది ఫొటో గ్రాఫర్లు పని చేస్తున్నారు. జిల్లాలో ప లు స్టూడియో, బేబీ స్టూడియోలతో పాటు పుట్టిన రోజు, పదవి విరమణ వీడియో, ఫొటో షూటిం గ్‌లకు స్థానికంగా ఉన్న పార్కులు, చుట్టు పక్కల ఉన్న అటవీ ప్రాంతాలు షూటింగ్‌లకు అనుకూలంగా ఉన్నాయి.

జిల్లాలో షూటింగ్స్...

జిల్లాలో షూటింగ్స్‌కు ఏసీసీ క్వారీ, గాంధారి వనం, గోదావరి నది తీరం, పచ్చని పంట పొలాలు తదితర ప్రాంతాలు అనుకూలంగా ఉన్నాయి. వివిధ ప్రాంతాల్లో షూటింగ్ కోసం కొన్ని స్టూడియోలను కూడా ఏర్పాటు చేశారు. వివాహానికి మాత్రం కరీంనగర్, వరంగల్, హైదరాబాద్, సిద్దిపేట, వైజాగ్, రాజమండ్రి ప్రాంతాలకు వెళ్లి షూటింగ్ చేస్తున్నారు. ప్రీ వెడ్డింగ్ వీడియో, పోస్ట్ వెడ్డింగ్ కోసం రూ. రెండు లక్షల నుంచి రూ. 3.50 లక్షల వరకు ఫొటో గ్రాఫర్లు సీజన్‌లకు అనుగుణంగా ప్యాకేజీలను ఇస్తున్నారు.

ప్రీ వెడ్డింగ్‌పైనే ఎక్కువ ఆసక్తి...



నరేష్ ఫొటో గ్రాఫర్, నస్పూర్

వివాహ వేడుకలను ఫొటో, వీడియో చిత్రీకరణ గతంలో సీజన్‌లోనే గిరాకి ఉండేది. ప్రస్తుతం నయా ట్రెండ్ రావడంతో ఆదాయంతో కూడిన ఉపాధి లభించింది. సీజన్‌లో పోటీతత్వం పెరిగిన కారణంగా కొందరు తక్కువ ప్యాకేజీలకు తీయడం మూలంగా నష్టంతో పాటు నాణ్యత లో పిస్తోంది. పెళ్లంటే నూరేళ్ల వరకు పది లంగా ఉండాల్సిన వీడియో, ఫొటో ఆల్బమ్స్ తొందరగానే కలర్స్ షేడ్ అవుతున్నాయి. ఖర్చుతో వెనుకాడకుం డా మంచి నైపుణ్యం కలిగిన ఫొటో గ్రాఫర్‌చే ప్రీ వెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్ చేయించాలి. క్వాలిటీని ఎంచుకుంటేనే ఫొటోల ఆల్బమ్స్, వీడియోలు మన్నికగా ఉంటాయి.

అవుట్ డోర్ షూటింగ్స్..



రాజేశ్, ఫొటో గ్రాఫర్, నస్పూర్

ప్రీ వెడ్డింగ్ షూట్, పోస్ట్ వెడ్డింగ్ షూట్స్‌లపై కొత్త జంటలు ఆసక్తి చూపుతున్నారు. నాణ్యతతో కూడిన కెమెరాలను వినియోగిస్తున్నాము. పెళ్లికి ముందు నుంచి పెళ్లి అయిపోయిన తర్వాత కొన్ని ఫొటోలు, వీడియో తీసి ఫొటో ఆల్బమ్, వీడియోలు తయారు చేసి ఇస్తాము. ప్ర స్తుతం టెక్నాలజీని ఎక్కువ ఉపయోగించి వినియోగించాల్సి వస్తోంది.

ఆధునిక కెమెరాలతో..

సాంకేతిక పరిజ్ఞానం, అధునాతన కెమెరాలతో నైపుణ్యం కలిగిన ఫొటో గ్రాఫర్లతో ఏకంగా సినిమా పాటలాగానే చిత్రీకరణ జరుగుతుంది. నూతన జంటలు అదిరిపోయే ఫోజులు, స్టిల్స్, స్లోగా పరుగు ఆయా సన్ని వేషాలు అధునిక కెమెరాలతో తీయడం వలన అద్భుతంగా కనిపిస్తాయి. క్యాలిటీ కెమెరాలతో పాటు ఐదారుగురు కెమెరమెన్లతో పాట షూటింగ్ జరుగుతుంది. అంతే కాకుండా షూటింగ్ ప్రదేశాలను, దుస్తులు మార్చ డం, మేకప్ తదితర వాటికి అధిక ప్రాధ్యాత ఇస్తున్నారు. చిత్రీకరించిన స న్నివేషాలను పాట రూపంలోకి తీసుకురావడానికి టెక్నాలజీ ద్వారా ఎడిటింగ్ చేస్తారు. పెళ్లి సన్నివేషాల చిత్రీకరణకు అత్యాధునిక కలిగిన కెమెరా ల ద్వారా షూటింగ్ చేస్తారు. ఒక ఫొటో, వీడియో గ్రాఫర్లు ప్రత్యేకంగా నూతన వధూవరులకు తెలియకుండానే వారి హావభావాలను, వివిధ ర కాల స్టిల్స్ ప్రత్యేకంగా తీస్తారు. వివాహ సన్నివేషాలను కెమెరాలతో పాటు డ్రోన్ ద్వారా చిత్రీకరిస్తారు.



పాముకాటుతో చిన్నారి మృతి



చిన్నారి విద్యశ్రీ (ఫైల్)

లక్షెట్టిపేట, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): అప్పటి వరకూ ఆ చిన్నారి కన్న వారి కళ్ల ముందే తిరిగింది. రోజూ వచ్చీ రాని మాటలతో ఇంట్లో వాళ్లందరినీ నవ్వించే ఆ నాలుగేళ్ల చిన్నారికి నూరేళ్లు నిండిపోయాయి. నిమిషాల్లోనే ఆ చిన్నారి వారి నుంచి దూరమైంది. కళ్ల ముందు ఆడుకుంటున్న చిన్నారి పాముకాటుతో మృతి చెందడంతో తల్లిదండ్రుల రోదనలు అక్కడున్న వారికి కన్నీళ్లు తెప్పించాయి. మండలంలోని వెంకట్రావుపేట గ్రామంలో పాము కాటుతో ఓ చిన్నారి శనివారం సాయంత్రం మృతి చెందింది.

కుటుంబ సభ్యులు గ్రామస్థుల కథనం ప్రకారం జాడి సుధాకర్ జీవిత దంపతులకు ముగ్గురు కుమార్తెలున్నారు. అందులో చిన్న కుమార్తె అయిన విద్యశ్రీ(4) సాయంకాలం ఇంటి సమీపంలో ఆడుకుంటోంది. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు చిన్నారిని పాము కాటువేయడంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై సురేష్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

ధాన్యం కొనుగోళ్లకు సమాయత్తం

(7వ పేజీ తరువాయి)

చర్యలు చేపట్టనున్నారు. కేవలం జిల్లా రైతులు పండించిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, వ్యవసాయ శాఖల సిబ్బంది సమన్వయంతో జిల్లాలోకి వచ్చే అంతరాష్ట్ర సరిహద్దుల వద్ద వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేయనున్నారు. చెక్ పోస్టుల వద్ద 24 గంటల పర్య వేక్షణ చేపట్టాలని ఆదేశాలు జారీ అయ్యాయి.

మద్దతు ధరలపై రైతుల పెదవి విరుపు..

కాగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా యాసంగిలో వరి ధాన్యం మద్దతు ధరలపై రైతులు పెదవి విరుస్తున్నారు. కేంద్రం ప్రకటించిన మేరకు వరి పంటకు మద్దతు ధర క్వింటాకు గ్రేడ్-ఏ రకం రూ. 2320 ఉండగా, కామన్ వెరైటీ ధర రూ. 2300 ఉంది. గత ఏడాదితో పోలిస్తే గ్రేడ్ ఏ, కామన్ వెరైటీకి రూ. 117 చొప్పున ధరలు పెరిగాయి. గత సంవత్సరం గ్రేడ్-ఏ రకం రూ. 2203 ఉండగా, కామన్ వెరైటీ రూ. 2183గా ప్రకటించారు. వరి సాగు చేసేందుకు ఎకరాకు సుమారు రూ. 25 వేల వరకు ఖర్చు వస్తుందని, ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధర పెంచాల్సిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మద్దతు ధర నిరాశపరిచింది..

లగిశెట్టి రాజమౌళి, గుడిపేట



యాసంగి సీజన్‌లో కేంద్ర ప్రభుత్వం ప్రకటిం చిన కనీస మద్దతు ధరలు పెరిగిన సాగురేట్లకు సరిపోవు. యాసంగిలో మూడె కరాల్లో వరి సాగు చేశాను. దాదాపు రూ. 75 వేల వరకు సాగు ఖర్చులే అయ్యాయి. మొత్తం 60 క్వింటాళ్ల మేర దిగుబడి వచ్చినా బోనస్ కలిపి రూ. లక్షా యాభైవేల వరకు గిట్టుబాటవుతుంది. ఇందులో తాలు, తప్ప, ప్రకృతి వైపరీత్యాల వల్ల జరిగే నష్టం పోనూ పెద్దగా చేతిక వచ్చేది ఏమీ లేదు. దొడ్డు రకానికి కూడా రూ. 2800 మద్దతు ధర కల్పిస్తే బాగుండేది.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం...

మోతీలాల్, జిల్లా అదనపు కలెక్టర్



ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ఇదివరకే సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశాం. త్వరలోనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించనున్నాం. కేంద్రాల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ఆదేశించాము. రైతులు కల్లాల్లోనే దాన్యాన్ని ఎండబెట్టుకొని, చెత్తచెదారం లేకుండా చేసి, కేంద్రానికి తీసుకురావలసి ఉంటుంది.

ఘనంగా హనుమాన్ చిన్న జయంతి





మందమర్రిలో పూజలు చేస్తున్న భక్తులు ..చెన్నూర్‌లో పూజలు చేస్తున్న భక్తులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పట్టణంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. మార్కెట్ సెంటర్‌లోని అంజనేయ స్వామి ఆలయం, పంచ ముఖి ఆంజనేయ స్వామి ఆలయం, మారుతినగర్ హనుమాన్ ఆలయం, యాపల్‌లోని ఆంజనేయ స్వామి ఆలయాలకు భక్తులు ఉదయం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆంజనేయ స్వామి విగ్రహాలను అందంగా అలంకరించారు. ఆలయ పూజారులు భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు. పలు ఆలయాల్లో అన్నదానం చేశారు.

దండేపల్లి: హనుమాన్ జయంతి పురస్కరించుకొని భక్తులు, హనుమాన్ దీక్షపరులు దండేపల్లి మండలంలోని ఊరురా శనివారం హనుమాన్ మందిరంలో అంజనేయస్వామికి పూజలు చేశారు.

జన్నారం : మండలంలో పైడిపెల్లి గ్రామంలోని హనుమాన్ ఆలయంలో వ్యాపారి జక్కు సత్తయ్య ఆధ్వర్యంలో హోమం నిర్వహించారు. అలాగే బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ భుక్య జాన్సన్ నాయక్ హనుమంతునికి పూజలు చేశారు.

శ్రీరాంపూర్: హన్మాన్ జయంతిని పురస్కరించుకొని పుట్కూరి నరేందర్‌రెడ్డి (వీఎన్ఆర్) ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పండ్లు పంపిణీ చేశారు. హన్మాన్ మాల ధరించిన భక్తులు, పాద చారులకు ఇందారం క్రాస్ రోడ్డుతో పాటు వివిధ హన్మాన్ ఆలయాలలో మజ్జిగ, వాటర్ బాటిళ్లు, పండ్లు అందించారు. వీఎన్ఆర్ ఫౌండేషన్ సభ్యులు మల్లెత్తు రాజేంద్రపాణి-రజిని, రేగండ్ల ఉపేందర్-స్వాతి, సందినేని సతీష్-మౌనిక, తిరుపతి-సుమలత దంపతులు పాల్గొన్నారు.

కన్నెపల్లి : కన్నెపల్లి మండలంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు భక్తి శ్రద్దలతో జరిగాయి. సాయంత్రం కన్నెపల్లి మండల కేంద్రంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు.

కోటపల్లి : మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లోని ఆంజనేయ స్వామి దేవాలయాల్లో శనివారం హనుమాన్ జయంతి వేడుకలను భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. మండల కేంద్రం లోని భక్తాంజనేయ స్వామి దేవాలయంలో గ్రామా నికి చెందిన పనకంటి సురేష్-అరుణ దంపతులు ఆంజనేయ స్వామికి వెండి నాణాలు, లక్ష్మణ స్వామికి వెండి ధనస్సును బహూకరించారు. వంగళ సంతోష్-సుమలత దంపతులు వెండి తమలపాకుల హారాన్ని స్వామి వారికి అలంకరించారు.

మందమర్రిరూరల్ : మండలంలో శనివారం హనుమాన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సారంగపల్లి పంచాయతీలోని దుబ్బపల్లిలోని ఆలయంలో ఆలయ పూజారీ సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెన్నూరు : పట్టణంలోని చోటా హనుమాన్, బడా హనమాన్ ఆలయాలకు భక్తులు పెద్ద సం ఖ్యలో చేరుకుని పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లోని హనుమాన్ ఆలయంలో ఆంజనేయ స్వామి ప్రత్యేక పూజలు చేశారు. అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల పూజారులు భక్తులకు తీర్ధ ప్రసాదాలను అందజేశారు. ఓత్కులపల్లిలో హనుమాన్ మాల ధరించి కాలినడకన కొండగట్టుకు వెళ్లి వచ్చిన మాధవరెడ్డి, సంపత్‌లను మాజీ జడ్పీటీసీ కరుణసాగర్‌రావు దంపతులు, గ్రామస్థులు సన్మానించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

బెల్లంపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాంనగర్‌లో ఓమహిళ ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు. వీరి వద్ద నుంచి లక్ష 11వేల 140 రూపాయల నగదుతో పాటు ఐదు సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

లైసెన్స్‌లు పొందడానికి సంప్రదించండి

బెల్లంపల్లి, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లిలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో మ్యాంగోమార్కెట్ ఏర్పాటు చేస్తున్నామని క్రయ విక్రయాలు జరిపేందుకు వ్యాపారస్తులు లైసెన్స్ పొందడానికి మార్కెట్ కమిటీ కార్యాలయంలో సంప్రదించాలని మార్కెట్ కమిటీ కార్యదర్శి భాస్కర్ తెలిపారు. పూర్తి వివరాల కోసం వ్యాపారస్తులు నేరుగా మార్కెట్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

ప్రతిభ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలి

బెల్లంపల్లి, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 4, 5, 6తరగతులు చదువుతున్న విద్యార్థులు పీపుల్ ప్రొగ్రేసివ్ ట్రస్టు ప్రతిభ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని టీఎస్‌యుటీఎఫ్‌జిల్లా అధ్యక్షుడు చక్రపాణి తెలిపారు, ప్రధాన కార్యదర్శి రాజవేణు తెలిపారు. టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 24న ఉదయం 9.30గంటలకు జిల్లా కేంద్రంలో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఆసక్తిగల వారు సెల్ 9704634005, 9491345407 నంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

గూడెంలో చైత్ర పౌర్ణమి జాతర

దండేపల్లి, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): చైత్ర పౌర్ణమి, హనుమాన్ జయంతిని పురస్కరించుకొని దండేపల్లి మండలం గూడెం శ్రీసత్యనారాయణస్వామి దేవస్థానంలో శనివారం వైభవంగా చైత్ర పౌర్ణమి జాతర జరిగింది. పలు జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు గూడెంగుట్టకు తరలివచ్చి సత్యదేవుడిని దర్శించుకున్నారు. ముందుగా ఆలయ సమీపంలో పవిత్ర గోదవరి నదిలో పుణ్యస్నానం ఆచరించి గంగమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయానికి చెరుకొని సత్యదేవుడిని పంచముఖ అంజనేయస్వామిని దర్శించుకున్నారు. తగిన సౌకర్యాలు కల్పించినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు.

అర్హుల దరఖాస్తులు తీసుకోవాలి

కాసిపేట, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తులు చేసుకున్న వారందరి దరఖాస్తులను పరిశీలించి అందరి వద్ద నుంచిదరఖాస్తులు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి పురుషోత్తం నాయక్ అన్నారు. మండలంలో రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకునే వారందూ మండల పరిషత్ కార్యాలయంలో రాజీవ్ యువ వికాస్ దరఖాస్తులను పరిశీలించారు. ఈ నెల 14 వరకు దరఖాస్తులు చివరి గడువు ఉండడంతో ఆసక్తి అర్హతలు ఉన్నవారందరూ మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్

నస్పూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు మౌలిక సదుపాయాలను కల్పించి సమస్యలను సత్వమే పరిష్కారం చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ అన్నారు. నస్పూర్ లోని సీతా రాంపల్లిలో శనివారం గావ్ చలో, బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని రేషన్ షాపును సందర్శించారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ సీతారాంపల్లిలో ముఖ్యంగా మురుగు కాలువలు, తాగునీరు, రోడ్ల సమస్యలు ఉన్నాయన్నారు. సింగరేణి ప్రాంతమైన కోట్ల రూపాయల ఆదాయం ఉన్న ప్రాంతం అభివృద్ధిపై శ్రద్ధ చూపడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆకుల అశోక్ వర్ధన్, ఆనంద్ కృష్ణ, రమేష్, పానుగంటి మధు, మిట్టపల్లి మొగిలి, ఈర్ల సదానందం, కుర్ర చక్రవర్తి, సదయ్య, మహేష్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు పనులను పూర్తి చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆదివారంలో గా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో కొనసాగుతున్న అంబేద్కర్ విగ్రహ ఏర్పాటు పనులను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ అంబేద్కర్ దేశానికి అందించిన సేవలు మరువలేనివన్నారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా ఈ నెల 14వ తేదీన ప్రారంభానికి విగ్రహాన్ని సిద్ధం చేయాలని సూచించారు.

ఘనంగా హనుమాన్ శోభాయాత్ర

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఐబీ చౌరస్తా నుంచి బెల్లంపల్లి చౌరస్తా వరకు శోభాయాత్ర చేపట్టారు. మహిళలు కోలాటాలు ఆడుతూ నృత్యాలు చేశారు. జైశ్రీరామ్, జై హనుమాన్ నామస్మరణతో ఆధ్యాత్మికత శోభ సంతరించుకుంది. బీజేపీ నాయకులు రఘునాథ్‌వెరబెల్లి, రమేష్, ముకేష్‌గౌడ్, విశ్వ హిందూ పరిషత్ సభ్యులు పాల్గొన్నారు.

విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో..

గర్మిళ్ల, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వీర హనుమాన్ శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు విజిత్‌కుమార్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడిన నిందితుల అరెస్టు

రామకృష్ణాపూర్, ఏప్రిల్12 (ఆంధ్రజ్యోతి): రామకృష్ణాపూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని సింగరేణి స్టోర్‌లో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను శనివారం అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. సింగరేణి అనుబంధ సంస్థ నీలిమా ఇండస్ట్రీ పాత స్టోర్స్‌లో 60 ఇనుప రాడ్లను రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించారని ఇండస్ట్రీ యజమాని చితుకూరు మల్లేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. మందమర్రి, రామకృష్ణాపూర్ పరిధిలో వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 60 ఇనుపరాడ్లు స్వాధీనం చేసుకొని పోలీసుస్టేషన్‌కు తరలించామన్నారు. నిందితులను విచారించగా 9మంది కలిసి ఇనుప రాడ్లను దొంగలించామని నేరం ఒప్పుకున్నారని మిగిలిన ఇద్దరిని పట్టుకుంటామని సీఐ తెలిపారు.

ప్రతీ విద్యార్థి లక్ష్యం ఎంచుకుని చదవాలి

లక్షెట్టిపేట, ఏప్రిల్ 12(ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థి చిన్న తనం నుంచే లక్ష్యం ఎంచుకుని చదవాలని డాక్టర్ ముంజం శంకర్‌రావు అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ బాలికల గురుకులం లో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పీఎంశ్రీ స్కీం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు సుమారుగా 18గంటల పాటు శ్రమించి చదవాలని సూచించారు. జీవితంలో స్థిరపడటాకి మన భవిశ్యత్తును అద్భుతంగా తీర్చిదిద్దుకోవడానికి చాలా కోర్సులు ఉన్నాయన్నారు. వాటిని అందిపుచ్చుకోవడం విద్యార్థుల బాధ్యతే అని గుర్తు చేసారు. ఈకార్యక్రమంలో ప్రిన్సిపల్ రమాకళ్యాణి, వైస్ ప్రిన్సిపల్ ఉమామహేశ్వర్‌రావు, జూనియర్ వైస్ ప్రిన్సిపల్ శ్రీలతతో పాటు ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి

రామకృష్ణాపూర్, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): క్యాతన్‌పల్ల ఫ్లైఓవర్ బ్రిడ్జీ ప్రారంభోత్సవానికి చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి రానుండడంతో శనివారం మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లను పరిశీలించారు. క్యాతన్‌పల్లి, రామకృష్ణాపూర్ ప్రజల ఇబ్బందులు పడుతుండడంతో బ్రిడ్జి ప్రారంభోత్సవంతో సమస్య తొలగిపోనున్నట్టు పట్టణ కాంగ్రెస్ అద్యక్షుడు రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉస్మానియా నుంచి డాక్టరేట్ పట్టా

కాసిపేట, ఏప్రిల్12(ఆంధ్రజ్యోతి): దేవాపూర్ ఓరియంట్ సిమెంట్ కంపెనీలో పర్మినెంట్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న రొడ్డ కిష్టయ్య కుమారుడు దినేష్ శుక్రవారం సాయంత్రం హైదరాబాద్‌లో ఉస్మానియా మెడికల్ కాలేజీ నుంచి డాక్టరేట్ పట్టా అందుకున్నాడు. ఓరియంట్ కంపెనీలో పని చేసే గిరిజన కార్మికుడు రొడ్డ కిష్టయ్య సునీత దంపతుల కొడుకు దినేష్ చిన్నప్పటి నుంచి చదువులో చురుగ్గా ఉండేవాడు. ప్రాథమిక విద్య దేవాపూర్‌లో కార్మిల్‌గిరి కాన్వెంట్ స్కూల్, హైస్కూల్, కాలేజీ విద్యను కాగజ్‌నగర్ నవోదయలో చదివాడు. అనంతరం ఉస్మానియా మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ పూర్తి చేసి శుక్రవారం పట్టా పొందాడు. దేవాపూర్ నుంచి మొదటి సారి డాక్టరేట్ పట్టా పొందిన రొడ్డ దినేష్‌ను కంపెనీ అధికారులు, కుటుంబ సభ్యులు పలువురు అభినందించారు.

షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధం

జైపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రసూల్‌పల్లి వద్ద శనివారం ప్రమాదవశాత్తూ షార్ట్ సర్క్యూట్‌తో కారు దగ్ధమైనట్లు అదనపు ఎస్ఐ నాగరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం శనివారం వేమనపల్లి మండలం ముల్కలపేటకు చెందిన కవికుమార్ తన బంధువులతో కలిసి కొండగట్టుకు వెళ్లి శనివారం సాయంత్రం ఇంటికి వస్తున్నారు. జైపూర్ మండలంలోని రసూల్‌పల్లి వద్దకు రాగానే కారులో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. గమనించిన కవికుమార్ డోర్లను పగులగొట్టి కారులో ఉన్న బంధువులను బయటకు దించాడు. దీంతో ప్రాణాపాయం తప్పింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఎస్టీపీపీలోని ఫైరింజన్‌లను రప్పించి మంటలను ఆర్పివేశారు. కారు పూర్తిగా దగ్ధమైంది.



విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలి

చింతలమానేపల్లి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఏటీడీవో ఖమన్‌హుస్సేన్ అన్నారు. మండలంలోని బాబాపూర్ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను శనివారం తనిఖీ చేశారు. నేరుగా తరగతి గదుల్లోకి వెళ్లి విద్యార్థుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు బాగా రాయాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అంది ంచాలని సూచించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపి ఉన్నారు.

చలివేంద్రం ప్రారంభం

లింగాపూర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఎస్సై గంగారామ్ శనివరా చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు పోలీసులు ప్రజల రక్షణకే పని చేస్తున్నారని చెప్పారు. పోలీసులు మీ కోసం భాగం పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాథోడ్ బలిరాంనాయక్, మాజీ వైస్ ఎంపీపీ గణపతినాయక్, వినోదో రాథోడ్, రమేశ్, హసిరాం పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో హెచ్‌పీ గ్యాస్ డీలర్ షాప్ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్సై కమలాకర్ ప్రారంభించారు. కార్యక్రమంలో డీలర్ ఖుర్షీద్ హుస్సేన్, జునేద్ అహ్మద్, కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ మేట్ల మండల కార్యవర్గం

బెజ్జూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ మేట్ల మండల కార్యవర్గాన్ని శనివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా షేణ్ముఖ చారి, ఉపాధ్యక్షుడిగా సురేష్‌గౌడ్, కార్యదర్శిగా రాజేష్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో మేటీలు మల్లేష్, శ్రీనివాస్, వైకుంఠం, జలపతి, తిరుపతి, అర్జున్, సంతోష్, స్వామి, వెంకటేష్, రాజేష్, శంకర్, సాయి క్రాంతి, భీమన్న, రవి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

- వేతనాలు పెరుగక ఇబ్బందులు
- ఉద్యోగ భద్రత లేదని ఆవేదన
- ప్రభుత్వం కనికరించాలని వినతి

గోపాలమిత్రల గోడు పట్టదా?



బెజ్జూరు, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): పశువుల ఆరోగ్యం, అధిక పాలనిచ్చే ఆవులు, గేదెల సంతతిని పెంచడంలో ప్రధాన పాత్ర పోషిస్తున్న గోపాల మిత్రల గోడు వినేవారు కరువయ్యారు. 25ఏళ్ల నుంచి వెట్టిచాకిరి చేస్తున్న గోపాలమిత్రలు నామమాత్రపు గౌరవ వేతనంతో పల్లెల్లో పని చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు ఉమ్మడి రాష్ట్రంలో పాడి పశువుల సంతతి పెంచడంతో పాటు పాల సేకరణ అభివృద్ధి చేసేందుకు గాను 2001లో పశుగణాభివృద్ధి సంస్థను ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సంస్థకు చైర్మన్‌ను నియమిం చడంతో పాటు జిల్లా వ్యాప్తంగా గోపాలమిత్రలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో 100కుపైగా మందిని గోపాలమిత్రలను నియమించారు. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో 19 మంది ఉన్నారు. దీని ద్వారా నియామకం అయిన గోపాలమిత్రలు తమకు కేటాయించిన గ్రామాల్లో పర్యటిస్తూ మేలు రకం జాతి దూడలను ఉత్పత్తి చేసేందుకు కృత్రిమ గర్భధారణ కోసం వీర్యాన్ని ఇంజక్షన్ ద్వారా గేదెలకు వేస్తారు. దీంతో గ్రామాల్లో మేలు జాతి రకం గేదెలు పెరగడంతో పాటు పాల సేకరణ పెరుగుతోంది. దీంతో పాటుగానే పశు సంవర్ధక శాఖ ఆద్వర్యంలో కొనసాగే పశువైద్య సిబ్బందికి వైద్య సేవలలో సహాయంగా ఉంటారు. 25ఏళ్లుగా సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం ఇప్పటి వరకు ఇంకా తాత్కాలిక పద్ధతిలోనే ఉంటున్నామని ఉద్యోగ భద్రత కరువు కావడంతో పాటు వేతనాలు సరిగా రావడం లేదని వాపోతున్నారు. నామమాత్రపు గౌరవ వేతనంతో పని చేస్తుండగా రిటైర్‌మెంట్ వయసు వచ్చినా రెగ్యులరైజేషన్‌కు నోచుకోవడం లేదు.

నెలవారీ లక్ష్యాలు..

జిల్లా వ్యాప్తంగా పని చేస్తున్న గోపాలమిత్రలకు నెలవారీ లక్ష్యాలు ఉంటాయి. నెలకు కనిష్ఠంగా 75 సిమన్స్‌ను(వీర్యం) పశుగణాభివృద్ధి సంస్థ నుంచి కొనుగోలు చేసి వాటిని గ్రామాల్లో గేదెలకు అందించాలి. ఈ లక్ష్యం ఒక్కో నెలలో ఒక రకంగా ఉంటుంది. నెలకు 40నుంచి 100వరకు కూడా సిమన్స్(వీర్యం) కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన ఒక్కో సిమన్‌కు రూ.40చొప్పున పశుగణాభివృద్ధి సంస్థ ఖాతాకు జమ చేయాలి. ఒకవేళ ఏదైనా ఒక నెలలో టార్గెట్ రాకుంటే ఆ నెల గోపాలమిత్రలకు జీతం లేనట్లేనని చెబుతున్నారు. ఇలా ప్రతీ నెల అధికారులు ఇచ్చే లక్ష్యాలు పూర్తి చేయకుంటే తమకు ఆ నెలంతా కుటుంబ పోషణ భారంగానే ఉంటుంది. అదే విధంగా ప్రతి నెలా గోపాలమిత్రలకు వేతనం రాక ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. వేతనం నెలనెల కాకుండా మూడు నుంచి ఆరు నెలలకు ఒకసారి వస్తుంది. గత ఆరు నెలల నుంచి జీతాలు రాక తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నామని వారు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమకు ఉద్యోగ భద్రత కల్పించి నెలనెలా వేతనాలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని గోపాలమిత్రలు కోరుతున్నారు.

ఇప్పటికీ అరకొర వేతనమే..

ఉమ్మడి రాష్ట్రంలో 2001 నుంచి నియామకమైన గోపాలమిత్రలు ఇప్పటికీ అరకొర వేత నమే అందుకుంటున్నారు. అప్పట్లో 1,200 రూపాయల గౌరవ వేతనంతో గోపాలమిత్రలు ఉద్యోగం ప్రారంభించారు. తర్వాత కొద్దిరోజులు రెండు వేల రూపాయలు జీతం వచ్చింది. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ గోపాలమిత్రల జీతాన్ని 3,500 రూపాయలకు పెంచారు. గోపాలమిత్రల విన్న పం మేరకు అప్పటి ప్రభుత్వం 2018లో వీరి వేతనాన్ని రూ.8500లకు పెంచింది. ప్రస్తుతం వారికి రూ.11,0 50ఇస్తున్నారు. ప్రభుత్వం 2022 నవంబరులో అన్ని వర్గాల ఉద్యోగులకు 30శాతం పీఆర్‌సీ ఇచ్చింది. దీంతో తమకు కూడా ప్రభుత్వం పీఆర్‌సీ వర్తింప జేస్తుందని భావించినా గోపాలమిత్రలకు నిరాశ తప్పలేదు.

ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం..

- కోసరి మనోహర్, గోపాలమిత్ర, సులుగుపల్లి



ప్రభుత్వం గోపాలమిత్రలక అరకొర వేతనాలు చెల్లిస్తుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాం. సరిపడా వేతనాలు లేక నెలనెలా చేతికి అందక అవస్థలు పడుతున్నాం. గ్రామాల్లో పశసంతతి పెంచేందుకు ఎంతో కృషి చేస్తున్న మమ్మలను ప్రభుత్వం గుర్తించడం లేదు. ఉద్యోగ భద్రత లేక, వేతనం పెరగక కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రభుత్వం మాకు న్యాయం చేయాలి.

ల్యాప్‌టాప్ అందజేత

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఒలింపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన కాగజ్‌నగర్ విద్యార్థి రామడుగుల ఆర్యకు శనివారం ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ల్యాప్ టాప్ అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రీ చైతన్య పాఠశాల బ్రాంచ్ విద్యార్థి ప్రతిభ చాటడం అభినందనీయమని కొనియాడారు. కార్యక్రమంలో శ్రీ చైతన్య స్కూల్స్ చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీ విద్య సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ నాయకులు

రెబ్బెనలో 'గావ్ చలో అభియాన్'

రెబ్బెన, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రెబ్బెనలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయంలో చెత్తాచెదారం తొలగించి నీటితో శుభ్రం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు దోని శ్రీశైలం మాట్లాడుతూ బీజేపీ హయాంలో గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర పార్టీ సూచన మేరకు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నామని చెప్పారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి వెళుతూ సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు రాంబాబు రాజు అగర్వాల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కృష్ణకుమారి, బీజేపీ ఆదిలాబాద్ పార్లమెంటు కో కన్వీనర్ కిరణ్ కుమార్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సావర్‌ఖేడ గ్రామాభివృద్ధికి కృషి



ఎమ్మెల్యే కోవ లక్ష్మిని సన్మానిస్తున్న మహిళలు

కెరమెరి, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సావరఖేడ గ్రామాబివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. మండలంలోని సావరఖేడ గ్రామాన్ని శనివారం సందర్శించి గ్రామంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన పలువురు మహిళలు ఆమెను సత్కరించి గ్రామ సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. ఎల్అండ్‌టీ రోడ్డు నుంచి గ్రామం వరకు దశల వారిగా రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తానని చెప్పారు. పూలా జీ బాబా ధ్యాన కేంద్ర నిర్మాణానికి తన వంతు సహకాకం అందిస్తానని హామీ ఇచ్చారు. జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ఏర్పాటు చేయగా కోరడంతో తన సొంత నిధుల ద్వారా ఏర్పాటు చేయిస్తానని చెప్పారు. అంతకు ముందు గ్రామ సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ దృపతాబాయి, మాజీ ఎంపీపీ కలాం, మా జీ సర్పంచ్ తులసీరాం, గ్రామస్తులు నారాయణ, పోశెట్టి పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అంబలి పంపిణీ



అంబలి పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు ఉబైద్‌బీన్ యహియా అంబలి పంపిణీ చేశారు. రోజు రోజుకు ఎండల తీవ్రత పెరుగుతున్న క్రమంలో బాటసారులకు, ప్రయాణికులకు, ప్రజలకు అంబలి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు రమణారెడ్డి, వినాయక్‌రావు, శంకర్, భీంరావు, విశాల్, ముబషీర్, గులాం, జావీద్, మాస్, ఫుర్ఖాన్, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శివపార్వతుల కల్యాణం



తాళి చూపుతున్న పూజారి దేవరవినోద్

రెబ్బెన, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): రెబ్బెన మండలం ఇందిరానగర్‌లోని మహంకాళీ అమ్మవారి జాతర ప్రారంభం సందర్భంగా శనివారం ఆలయంలో శివపార్వతుల కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి దేవర వినోద్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమల తిరుపతి నుంచి పట్టు వస్త్రాలు తీసుకొచ్చి ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఎస్సై చంద్రశేఖర్ ఆధ్వర్యంలో బందోబస్తు చేపట్టారు.

ఈత సరదా.. ప్రాణాలు తీస్తోంది




ఈత కొడుతున్న చిన్నారులు(ఫైల్)

ఆసిఫాబాద్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): వేసవి వచ్చిందంటే పిల్లలు, పెద్దలు నీటి కుంటలు, బావులు, చెరువులు, ఈత కొలనులను ఆశ్రయిస్తారు. ఎండల తీవ్రతతో కొందరు, మరి కొందరూ సేద తీరుతుంటారు. దురదృష్టవశాత్తూ నీట మునిగి కొందరు తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారు. పదో తరగతి, ఇంటర్ పరీక్షలు పూర్తయ్యాయి. విద్యా సంస్థలకు ఈనెల 24 నుంచి వేసవి సెలవులు రానున్నాయి పిల్లలు తమ ఊళ్లకు వెళ్లి ఉత్సాహంగా గడపాలని అనుకుంటారు. సరదా కోసం మిత్రులతో క లిసి చెరువులు, వాగులు, కాలువల వద్దకు ఈతకు వెళ్లి ప్రమాదానికి గురైన సంఘటనలు గతంలో చాలా ఉన్నాయి. వాటి నుంచి పిల్లలను కాపాడుకోవడానికి తల్లిదండ్రులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఈత సరాదా పిల్లల ప్రాణాలను బలి తీసుకొంటోంది. ప్రాజెక్టులు, చెరువుల్లో ఈత కొట్టేందుకు వెళ్తున్న వారు విగత జీవులుగా మారి తల్లిదండ్రులకు గర్భకోశాన్ని మిగిలిస్తున్నారు. అవగాహన లేమితో ప్రాజెక్టులు, చెరువుల లోతును సరిగ్గా అంచనా వేయలేకపోతున్నారు. నీటిలో పెరిగిన నాచు, మొక్కలు కాళ్లకు తగిలి నీటిలో ఊపిరాడక మృతి చెందుతున్నారు. పిల్లలు ప్రాజెక్టులు, చెరువులు, కుంటల్లో ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

సరదాగా వెళుతూ..

వేసవి కాలం సెలవుల రోజుల్లో సరదాగా ఈతకు వెళ్లి మృత్యువాత పడుతున్న వారి సంఖ్య ఏటా పెరుగుతోంది. ప్రాజెక్టులు, చెరువులలో ఈతకు వెళ్లి మునిగి ప్రమాదాలకు గురై మృతి చెందుతున్నారు. దీంతో తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిలిస్తున్నారు. అవగాహన లేమి, నీటి లోతు తెలియకపోవడం, వచ్చిరాని ఈత, స్నేహితుల మధ్య సరదగా పెట్టుకునే పోటీలు ఈ తరహ సంఘటనలకు కారణమవుతున్నాయి. వేసవి సెలవుల్లో పిల్లలు ఎక్కువగా ఈతకు వెళ్లే ఆవకాశం ఉండడంతో ప్రాజెక్టులు, చెరువుల వద్ద కాపలాదారులను ఏర్పాటు చేయాలి. ఈతరాని పిల్లలపై మరింత జాగ్రత్తగా వ్యవహరించాలి. ఎందుకంటే ఈత సరదా, తోటి మిత్రుల ప్రోత్సాహం వారిని నీటివైపు లాక్కొని పోతుంది. ఈత సరదా ఉన్న పిల్లల ఆసక్తిని గమనించి తామే స్వయంగా స్వీయ పర్యవేక్షణలో నేర్పించడం మంచిది.

తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి..



తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలి. పిల్లలను ఓ కంట కనిపెట్టి ఉండాలి. సాధ్యమైనంత వరకు స్నేహితులతో ఈతకు పంపకపోవడమే మంచిది. పిల్లలకు ఈత పై ఆసక్తి ఉంటే స్వీయ పర్యవేక్షణలో నేర్పించాలి. ఈతకు వెళ్లి ప్రమాదానికి గురైతే బాధితుడిని ఒడ్డుకు చేర్చిన తర్వాత వెల్లకిలా పడుకోబెట్టాలి అవసరమైతే కృత్రిమ శ్వాస అందించాలి. ఛాతిపై చేతులతో ఒత్తాలి. దీని వల్ల శ్వాస పెరుగుతుంది. అనంతరం దగ్గరలోని ఆసుపత్రికి తీసుకువెళ్లాలి.

- సత్యనారాయణ, వైద్యుడు, ఆసిఫాబాద్

భక్తి పారవశ్యం

- జిల్లా వ్యాప్తంగా హనుమాన్ ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- శోభాయాత్రలు, అన్నదాతలు
- పాల్గొన్న భక్తులు, మాలధారులు



కాగజ్‌నగర్‌లో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు



అలంకరించిన స్వామివారు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా పలు చోట్ల శనివారం హనుమాన్ చిన్న జయంతి సందర్భగా భక్తి పారవశ్యం నెలకొంది. హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శోభాయాత్రలు నిర్వహించారు. పలు చోట్ల అన్నదానం చేశారు. కాగజ్‌నగర్ పట్టణంలో శనివారం రాత్రి మహవీర్ హనుమాన్ జయంతిని పురస్కరించుకొని శనివారం రాత్రి శోభాయాత్ర నిర్వహించారు. స్థానిక హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ పట్టణ పలు వీధుల గుండా సాగింది. ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విఠల్, సిర్పూరు ఎమ్మెల్యే డాక్టర్ హరీష్‌బాబు, సిర్పూరు మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కూడా భక్తులకు చల్లటి పానీయాలను అందజేశారు. పట్టణ సీఐ రాజేంద్రప్రసాద్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మహారాష్ట్ర కళాకారుల ప్రదర్శన ఆకట్టుకుంది.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. బెజ్జూరు మండల కేంద్రంతో పాటు ఎల్కపల్లి, చిన్న సిద్దాపూర్ తదితర గ్రామల్లో హనుమాన్ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో జెండాలను ఎగుర వేశారు. మండల కేంద్రంలోని రంగనాయక ఆలయ ప్రాంగణం నుంచి నిర్వహించిన ద్విచక్ర వాహన ర్యాలీని ఎస్సై ప్రవీణ్‌కుమార్ ప్రారంభించారు. బెజ్జూరు నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఎల్కపల్లి, చిన్నసిద్దాపూర్, నాగులవాయి, హేటిగూడ తదితర గ్రామాల మీదుగా కొనసాగింది. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): ఆంజనేయస్వామి ఆశీస్సులతో సిర్పూర్ నియోజక వర్గం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్సీ దండె విఠల్ అన్నారు. ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన శోభాయాత్రలో పాల్గొన్నారు. శివకేశవాలయం నుంచి ప్రారం భమైన శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నృత్యాలు చేశారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): మండలంలో హనుమాన్ చిన్న జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా టోంకిని సిద్ది హనుమాన్ ఆలయంలో తెల్లవారు జాము భక్తులు పెద్ద సంఖ్యలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆల య సమీపంలో పెన్‌గంగా ఆలయంలో పుణ్యస్నానాలు ఆచరించారు. సీఐ రమేష్, ఎస్సైలు కమలాకర్, మధుకర్‌లు బందోబస్తు నిర్వహించారు.

పెంచికలపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలయాలు శ్రీరామ నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. మండల కేంద్రంలోని హనుమాన్ విగ్రహం వద్ద భక్తులతో కలిసి ఎమ్మెల్సీ దండె విఠల్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్విచక్ర వాహన ర్యాలీని ప్రారంభించారు. ద్విచక్ర వాహనాలతో మొదలైన శోభాయాత్ర ఎల్కపల్లి, ఎల్లూరు గ్రామాల మీదుగా కొనసాగింది. మాజీ జడ్పీటీసీ సరిత, రాజన్న దంపతులు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముస్లింలు శోభాయాత్రగా వెళ్లిన భక్తులకు పండ్లు పంపిణీ చేశారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా హనుమాన్ చిన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీరామనామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. హనుమాన్ జయంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయంతో పాటు అన్ని గ్రామాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహజించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమాన్ ఆలయాల్లో ప్రజలు ప్రత్యేక పూజలు చేశారు. సిర్పూర్(యు)లో గల ఆంజనేయ స్వామి ఆలయంలో ఆత్రం గంగారాం దేవరి గ్రామ పటేల్ ఆత్రం ఆనంద్‌రావు అధ్వర్యంలో స్వామికి నైవేద్యం సమర్పించారు.

జైనూర్, (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంతో పాటు మారుమూల గ్రామాల్లో హనుమాన్ చిన్న జయంతి వేడుకలు నిర్వహించారు. పవర్‌గూడ, జామ్ని, జైనూర్, రాసిమెట్ట, భుసిమెట్ట, పోలాస, డబోలి, పాట్నాపూర్, జండాగూడ, లేండిగూడ, గౌరి, జంగాం, ఆశపెల్లి, నందునాయక్ తండాలో ప్రజలు పూజలు చేశారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంతో పాటు కొత్తపల్లి, కంచన్‌పల్లి, పిక్లాతండా, మామిడిపల్లి, ఘూంనూర్, మెతిపట్టార్, చోర్‌పల్లి, పిట్టాగూడా, జాముల్‌ధర, లోద్దిగూడ, కిమానాయక్ తండ, ఎల్లాపట్టార్ గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.



దహెగాంలో శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్సీ దండె విఠల్



పెంచికలపేటలో మహిళల శోభాయాత్ర